క్లుప్తంగా

శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం ముఖ్యం



లక్ష్మీపురం: శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం ముఖ్యమని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ కె.సురేష్‌కుమార్ అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ప్రపంచ స్కిజో ఫ్రేనియా దినోత్సవం సందర్భంగా ఆరోగ్య సభ నిర్వహించారు. స్కిజోఫ్రెనియాతో బాధపడే వారికి డిమెన్సియా అనే మానసిక సమస్య వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. కాటూరి వైద్య కళాశాల డాక్టర్ ఎస్.సంజయ్ మాట్లాడుతూ పెద్దవారిలో ఎక్కువగా కనపడే మరొక మానసిక సమస్య అల్జీమర్స్ అనే మతిమరుపు సమస్య అని అన్నారు. షుగర్, బీపీ ఉన్నవారికి అల్జీమర్స్ సమస్య ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నదని అన్నారు. వైద్యులను ఘనంగా సత్కరించారు. సమావేశానికి కోఆర్డినేటర్‌గా టీవీ సాయిరాం వ్యవహరించగా, ప్రభుత్వ విశ్రాంత అధికారి తిరుమల రావు పాల్గొన్నారు.

అహల్య ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం



గుంటూరు మెడికల్: వ్యాధులు వచ్చాక ఆస్పత్రుల చుట్టూ తిరగటం కంటే వ్యాధులపై అవగాహన కలిగి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చని అహల్య ట్రస్ట్ నిర్వాహకులు, సీనియర్ ఐవీఎఫ్ స్పెషలిస్ట్ డాక్టర్ శనక్కాయల రాజకుమారి అన్నారు. ఆదివారం జొన్నలగడ్డలో అహల్య ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యశిబిరంలో సీనియర్ ఐవీఎఫ్ స్పెషలిస్ట్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ మాట్లాడుతూ పేదలకు కార్పొరేట్ వైద్యసేవలను ఉచితంగా అందిచటమే లక్ష్యంగా తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామాల్లో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఉచిత మెడికల్ క్యాంపులో సుమారుగా 250 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కరీమా, డాక్టర్ కె.లిఖిత, అహల్య హాస్పిటల్ స్టాఫ్, జొన్నలగడ్డ సర్పంచి సుధాకర్, ఉప సర్పంచి ఎం.శ్రీనివాస్, వెంకట్రావు, శివ గంగయ్య, మల్లి పాల్గొన్నారు.

నేటి నుంచి ఆయుర్వేదంపై జాతీయ సెమినార్


డాక్టర్ గోపాలన్

గుంటూరు మెడికల్: ఆయుర్వేద వైద్యులకు నేషనల్ లెవెల్ సెమినార్, శిక్షణ కార్యక్రమం స్నిగ్ధ ఆయుర్వేద వైద్యశాల పాత్తూరులో విశ్వాయుర్వేద పరిషత్ ఆంధ్రప్రదేశ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు స్నిగ్ధ ఆయుర్వేద వైద్యశాల చైర్మన్, చీఫ్ ఫిజీషియన్ డాక్టర్ కేఎస్ఎన్ గోపాలన్ తెలిపారు. ఆదివారం స్థానిక సాలిపేటలోని స్నిగ్ధ ఆయుర్వేద వైద్యశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. డాక్టర్ గోపాలన్ మాట్లాడుతూ జూన్ రెండో తేదీ నుంచి 6 వరకు అనేక అంశాలపై వైద్యులకు, ఆయుర్వేద వైద్య విద్యార్థులకు శిక్షణ, హాండ్స్ ఆన్ ట్రైనింగ్ జరుగుతుందన్నారు. పంచకర్మ, ఆయుర్వేదిక్ సర్జరీ, గర్భ చికిత్స, మర్మ చికిత్స, నాడి చికిత్స, బేసిక్ లైఫ్ సపోర్ట్ , అంటిజం, క్యాన్సర్ చికిత్స తదితర ఆయుర్వేద చికిత్సలపై శిక్షణ, హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ ఇస్తున్నట్లు వెల్లడించారు. జాతీయస్థాయిలో జరుగుతున్న సెమినార్‌కు దేశం నలుమూలల నుండి వైద్యులు వస్తున్నారని తెలిపారు. విలేకరుల సమావేశంలో స్నిగ్ధ ఆయుర్వేద వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ చైతన్య, ప్రెసిడెంట్ డాక్టర్ మాధవరావు చౌదరి, విశ్వ ఆయుర్వేద పరిషత్ ఆంధ్రప్రదేశ్ జనరల్ సెక్రెటరీ డాక్టర్ సాహితి పాల్గొన్నారు.

సంప్రదాయ కళల్లో శిక్షణ అభినందనీయం



నగరంపాలెం: సంప్రదాయ కళల్లో నెలరోజులు ఉచిత శిక్షణ అందించడం అభినందనీయమని ప్రముఖ నాట్యాచారులు కాజా సుబ్రహ్మణ్యం అన్నారు. సంపత్‌నగర్ శ్రీరామనామక్షేత్రంలో నిర్వహించిన సమ్మర్ క్యాంపు ముగింపు సభ ఆదివారం సాయంత్రం నిర్వహించారు. సద్గురు కళానిలయం నిర్వహణలో జరగ్గా, నంది అవార్డు గ్రహీత బసవరాజు జయశంకర్ సభాధ్యక్షత వహించారు. ఆలయ ప్రధానార్చకులు శ్రీమాన్ రాఘవాచారి వేదస్వస్తి ప్రార్ధనతో ప్రారంభించారు. అనంతరం కాజా సుబ్రహ్మణ్యం దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌వీ రమణరవిబాబు, నడింపల్లి హనుమంతరావు, శిక్షణాచార్యులు బసవరాజు జయశంకర్, పీవీ లక్ష్మీతేజస్వి, వైఆర్ సుబ్రహ్మణ్యం, కిన్నెర, బి.రామకృష్ణారావు, పి.హేమలతనారాయణ పాల్గొన్నారు.

ఎక్కడి సమస్యలు అక్కడే...

- ఏళ్లు గడిచిన బాగుపడని కాలనీలు
- అధ్వానంగా అడ్డరోడ్లు..
- ఖాళీ స్థలాలతో ఇక్కట్లు
- ప్రజల్లో ప్రశాంతత కరువు
- పట్టించుకోని అధికారులు


ప్రశాంతినగర్ 1/1వ అడ్డరోడ్డు దుస్థితి..

నగరంపాలెం: ఎన్నో ఏళ్ల కిందట ఏర్పడిన కాలనీ. అంతర్గత రోడ్లు చూస్తే శ్రద్ధ ఏపాటితో అర్థం చేసుకోవచ్చు. డ్రెయిన్లు లేవు. మురుగు రోడ్లపైనే.. చెత్త రోడ్ల వెంబడే దర్శనం.. ఎటు చూసినా ఖాళీ స్థలాలు.. వాటిలో ఏపుగా పెరిగిన ముళ్ల పొదలు.. పాముల సంచారంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు, పాలకులకు కాలనీవాసులు అర్జీలు ఇచ్చినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఎక్కడి సమస్యలు అక్కడే దర్శనమిస్తున్నాయి. అదే ప్రశాంతినగర్.

సుమారు 15 ఏళ్లకు పైగానే..

జీఎంసీ పరిధిలోని 46వ డివిజన్ ప్రశాంతినగర్ ఏర్పాటై 15 ఏళ్లకు పైగా గడిచాయి. మూడు వీధులు, రెండు అడ్డ రోడ్లతో వీధులున్నాయి. దాదాపు రెండు వందల కుటుంబాలు నివసిస్తున్నాయి. అయితే రహదారుల నిర్మాణంలో వివక్షత చాటుతున్నారు. స్థానికంగా అడ్డరోడ్లు అధ్వానంగా మారాయి. గతంలో భూగర్భ డ్రెయినేజీ పనుల నిర్మాణాలు జరగ్గా, మొక్కుబడిగా మరమ్మతులు చేశారు. దీంతో ఆ రహదారులు చివరి వరకు ఎత్తు పల్లాలుగా ఉన్నాయి. దీనికితోడు అటుగా రాకపోకలు చేయాలంటే కష్టంగానే ఉంటుంది. స్థానికంగా ఉండే వారికి తప్పడంలేదు. ఏమాత్రం అజాగ్రత్తగా వెళ్లిన ప్రమాదవశాత్తు కిందపడిపోవాల్సిందేనని స్థానికులు అంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు చిన్నపాటి గుంతల వద్ద వర్షం నీరు నిలిచి మరింత ఇబ్బందిగా మారిందని వాపోయారు. ఈ ప్రాంతంలో ప్రధాన రహదారులు సిమెంట్‌తో నిర్మించగా, అడ్డరోడ్ల నిర్మాణంలో అలసత్వం ఎందుకు ప్రదర్శిస్తున్నారనేది అర్థంకావడంలేదని స్థానికులు ఆందోళన వ్యక్తంచేశారు. అందరి వలె ఇంటి, నీరు, ఇతరత్రా పన్నులు చెల్లిస్తున్నా, తమపై నిర్లక్ష్యం వహించడం సరికాదని వాపోయారు.


మురుగు కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు

ఇళ్లల్లోకి విష సర్పాలు..

ఈ ప్రాంతంలో సైడు కాల్వలు అధ్వానంగా మారాయి. అక్కడక్కడ కాలువలు శిథిలావస్థకు చేరాయి. దీంతో మురుగునీరు ముందుకు కదలడం లేదు. దీనికి తోడు పూడికతీత పనులు సక్రమంగా చేపట్టడంలేదు. తద్వారా భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. అంతేగాక ఖాళీ ప్రదేశాలు స్థానికులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ప్రతి వీధిలోనూ ఖాళీ స్థలాలు దర్శనమిస్తున్నాయి. అందులో తుమ్మ, ఇతరత్రా చెట్లు ఏపుగా పెరిగాయి. విష సర్పాలు, జెర్రి, తేళ్లు ఇళ్లల్లోకి వస్తున్నాయని వాపోయారు. అంతేగాక స్థానికంగా సేకరించిన చెత్త, చెదారం, చుట్టు పక్కల వారు వ్యర్థాలను అందులోకి విసిరేస్తున్నారు. దీంతో మరింత దుర్వాసనగా వస్తోంది.

నాలుగు లైన్లుగా మార్చాలని వినతి..

స్థానికంగా నీటి పైపులైన్లను నాలుగు లైన్లుగా మార్చలేదు. ప్రస్తుతం మూడు లైన్ల పైపులుగా ఉన్నాయి. నాలుగు లైన్లుగా మార్చాలని అనేకమార్లు వినతిపత్రాలు అందించిన చలనం లేదు. దీంతో నీటికి ఇబ్బందులుగా ఉన్నాయని వాపోయారు. స్థానికంగా నెలకొన్న సమస్యలపై కమిషనర్, ఓ ప్రజా ప్రతినిధికి వినతిపత్రాలు సమర్పించినట్లు ప్రశాంతినగర్ సంక్షేమ సంఘం నిర్వాహకులు తెలిపారు. అయినప్పటికి ఎటువంటి చర్యలు చేపట్టడంలేదని తెలిపారు.

అధ్వానంగా అడ్డరోడ్లు..



అడ్డరోడ్లు అధ్వానంగా ఉన్నాయి. గుంతలుగా మారడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. వృద్ధులు జాగ్రత్తగా నడవాల్సి వస్తోంది. ఏమాత్రం నిర్లక్ష్యంగా నడిచిన ఇబ్బందులు తప్పవు. ఖాళీ స్థలాల్లోని పిచ్చిమొక్కలు పెరగడంతో పాములు ఇళ్లల్లోకి వస్తున్నాయి. చాలా భయంగా ఉంది.

– జి.హైమావతి, స్థానికురాలు

ఉచిత మోడల్ లా సెట్‌కు అనూహ్య స్పందన


మోడల్ పేపర్ విడుదల చేస్తున్న నిర్వాహకులు

నగరంపాలెం: ఏపీ బీసీ అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత మోడల్ లాసెట్ పరీక్ష ఆదివారం నిర్వహించారు. శ్యామలానగర్ ఒకటో వీధిలోని మంటెస్సోరి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో చేపట్టిన పరీక్ష విశేష స్పందన లభించింది. సీనియర్ ఏపీపీ పరిశపోగు సునీల్ కుమార్, ఏపీపీ పల్లపు కృష్ణ, గుంటూరు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మోతుకూరి శ్రీనివాసరావు మోడల్ పేపర్‌ను విడుదల చేశారు. పరీక్షలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజయం సాధించిన అభ్యర్థులకు మాంటిస్సోరి స్కూల్ ప్రిన్సిపాల్ సెబాస్టియన్, బహుజన నాయకులు తాడికొండ నరసింహారావు, జూపూడి శ్రీనివాసరావు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శి గండికోట శేషగిరిరావు, న్యాయవాదులు ఓర్పు జనార్ధనరావు, చిలక డేవిడ్‌రాజ్, ఎ.కోటేశ్వరరావు, బీసీ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షులు బీసీ రమణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

జొమోటో కార్మికుల సమస్యలు పరిష్కరించండి

లక్ష్మీపురం: జొమోటో కార్మికుల సమస్యలు పరిష్కారం చేయకుండా యాజమాన్య ప్రతినిధులు కాలయాపన చేస్తూ సమస్యను జఠిలం చేస్తున్నారని, సమస్యను వెంటనే పరిష్కరించాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమంగా మారుస్తామని గిగ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) గౌరవాధ్యక్షులు బి.ముత్యాలరావు హెచ్చరించారు. ఆదివారం సంఘం కార్యాలయంలో ముత్యాలరావు విలేకరులతో మాట్లాడారు. జొమాటో కార్మికులు ఎదుర్కొన్న సమస్యలు పరిష్కారించాలని మే 29వ తేదీ నుంచి నిరసన తెలియజేస్తున్నారని అన్నారు. కార్మిక శాఖ అధికారి యాజమాన్య ప్రతినిధులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని చెప్పినప్పటికీ యాజమాన్య ప్రతినిధులు కాలయాపన చేస్తున్నారని అన్నారు. సమస్య పరిష్కారం చేయకపోతే జూన్ 2వ తేదీ నుంచి గుంటూరు నగరం మొత్తం జొమోటో కార్మికులు అందరూ విధులు నిలుపుదల చేస్తారని, తర్వాత జరిగే పరిణామాలకు యాజమాన్యం ప్రతినిధులే బాధ్యత వహించాలని అన్నారు. సమావేశంలో జమోటో ప్రతినిధులు సోగా బ్రహ్మయ్య, క్రాంతి రణదేవ్, మోహన్ పాల్గొన్నారు.

రెడ్డి హాస్టల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నెహ్రూనగర్: ఎస్‌వీఎస్‌ఆర్ రెడ్డి హాస్టల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం నగరంపాలెంలోని రెడ్డి హాస్టల్ నిర్వహించారు. హాస్టల్ అధ్యక్షులు చల్లా అంజిరెడ్డి, అన్నపురెడ్డి పవన్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి 1977 నుంచి 2024 వరకు చదువుకున్న వారంతా హాజరయ్యారు. హాస్టల్ భవనం నిర్మించి 50 సంవత్సరాలై శిథిలావస్థకు చేరుకోవడంతో హాస్టల్ పునఃనిర్మాణానికి రూ.50 లక్షలు విరాళం ప్రకటించారు. కార్యక్రమంలో సెక్రటరీ కంది సంజీవరెడ్డి, ఉపాధ్యక్షులు పడాల సుబ్బారెడ్డి, సూరసాని వెంకటరెడ్డి, జాయింట్ సెక్రటరీ భవనం వెంకటరెడ్డి, కోశాధికారి వనుకూరి సాంబిరెడ్డి, రెడ్డి జన సేవా సమితి అధ్యక్షులు వీసీఆర్ రెడ్డి, ఉపాధ్యక్షులు లేళ్ల పెద్ద అప్పిరెడ్డి, శ్యామల కోటిరెడ్డి, ట్రెజరర్ జంగా సీతారామిరెడ్డి, సోమసాని బ్రహ్మానందరెడ్డి, వనుకూరి సాంబిరెడ్డి, ఎం.భాస్కర్‌రెడ్డి, జి.వెంటరెడ్డి పాల్గొన్నారు.

5న విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: పర్యావరణ దినోత్సవం సందర్భంగా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 5న చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. యూటీఎఫ్ కార్యాలయంలో పోటీలకు సంబంధించిన పోస్టర్లు ఆదివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు బ్రాడీపేట 2/6లోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. 5,6,7 తరగతుల విద్యార్థులకు జూనియర్, 8,9,10 తరగతుల విద్యార్థులకు సీనియర్ విభాగంలోనూ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే ప్రతి విద్యార్థికి సర్టిఫికెట్ ఇస్తామని, ఇతర వివరాలకు 97035 79996, 90004 59600, 99480 15701 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు డాక్టర్ ఏ సత్యనారాయణప్రసాద్, జి.వెంకట్రావు, బి.ప్రసాద్, ఎస్ఎం.సుభానీ, ఎం.ఉదయభాస్కర్, ఎం.హనుమంత రాజు, బి.ప్రతాప్ సింగ్, ప్రొఫెసర్ వేణుగోపాలరావు పాల్గొన్నారు.

బీపీ మండల్ ట్రస్ట్ లోగో ఆవిష్కరణ


బీపీ మండల్ ట్రస్ట్ లోగోను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి రఘువీరారెడ్డి, సీపీఐ రామకృష్ణ

నెహ్రూనగర్: బీసీల అభ్యున్నతికి సరైన వేదిక ఉండాలనే ఉద్దేశంతో బీపీ మండల్ ట్రస్ట్ ఏర్పాటు చేయడం జరిగిందని బీపీ మండల సేన రాష్ట్ర నాయకులు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం నల్లచెరువులోని ఓ ఫంక్షన్ హాల్‌లో మాజీ మంత్రి రఘువీరారెడ్డి, టీటీడీ బోర్డు మెంబర్ జంగా కృష్ణమూర్తి, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ డాక్టర్ శ్యాంప్రసాద్, ఏపీ టీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణలతో కలసి బీపీ మండల్ ట్రస్ట్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా రఘువీరారెడ్డి మాట్లాడుతూ బీసీల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా బీపీ మండల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి రాజధాని ప్రాంతంలో 40 సెంట్ల భూమిని ట్రస్ట్‌కు విరాళంగా ఇస్తామని ప్రకటించిన ఆలా వెంకటేశ్వర్లును ప్రత్యేకంగా అభినందించారు.

స్కాలర్‌షిప్‌లు పంపిణీ

అనంతరం శ్రీ కృష్ణ యాదవ సేవా సమితి ఆధ్వర్యంలో 500 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ చేశారు. యాదవ విద్యార్థుల కెరీర్ గైడెన్స్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా పరిషత్ సీఈఓ బి.జ్యోతిబసు మాట్లాడుతూ విద్యార్థులు నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా ముందుకు సాగాలన్నారు.

విద్యతోనే సమాజంలో గౌరవం

పెదకాకాని: క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడంతోనే సమాజంలో గౌరవం, గుర్తింపు లభిస్తాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ అన్నారు. పెదకాకాని సుందరయ్యకాలనీలో ఆదివారం పీహెచ్‌డీ పట్టా పొందిన కుక్కల ప్రభుచంద్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శివాజీ మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబంలో జన్మించిన ప్రభుచంద్ పెదకాకానిలోని ప్రభుత్వ పాఠశాలలో చదివారని గుర్తుచేశారు. నేడు ఝార్ఖండ్‌లోని ధన్‌బాద్ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పోస్టు గ్రాడ్యుయేట్ పట్టా పొందడం అభినందనీయమన్నారు. తాను చదువుకున్న విద్య ద్వారా సాటి వారికి మేలు చేసేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రభుచంద్ అన్నారు. అనంతరం సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రభుచంద్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కోటిపల్లి సత్యనారాయణ, ఉల్లంగుల శివయ్య, బురదగుంట సాంబయ్య, బాబూరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొరిటెపాడు(గుంటూరు): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా నగరంలో సోమవారం సరఫరా నిలిపివేయనున్నట్లు టీ–4 డీఈఈ పీహెచ్ ఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డీ–13 సెక్షన్(ఆర్టీసీ కాలనీ) పరిధిలో 11 కేవీ వైష్ణవి ఫీడర్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు. ఎల్‌బీ నగర్, షాప్ ఎంప్లాయీస్ కాలనీ, రజకుల కాలనీ, వెంకటేశ్వర కాలనీ, పోలీస్ ఫ్లాట్స్, నందమూరి కాలనీ, ఆర్టీసీ కాలనీ ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.


- డీ–3 సెక్షన్‌లో 11 కేవీ 14వ ఫీడర్‌లో విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా పాతూరివారితోట, గుంటూరువారి తోట, డీ–1 సెక్షన్ 11 కేవీ ఎల్ఈఎం ఫీడరు పరిధిలో బ్రాడీపేట, డీ–10 సెక్షన్ పరిధిలో 11 కేవీ పరిధిలో బుడంపాడు ఫీడర్, పొన్నూరు రోడ్, హుస్సేన్ నగర్, చంద్రబాబునాయుడు కాలనీ ప్రాంతాల్లో కరెంట్ అంతరాయం ఉంటుందని టౌన్–1 డీఈఈ షేక్ ముస్తాక్ అహ్మద్ ఆదివారం తెలిపారు.
- 11 కేవీ బీఆర్ స్టేడియం ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా పాతగుంటూరు పోలీస్ స్టేషన్, సత్యనారాయణ స్వామి గుడి, అలీ నగర్, బావాజీ మఠం , ముగ్దుం నగర్ 9వ లైన్ ప్రాంతాల్లో సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలివేయనున్నట్లు డీఈఈ పీహెచ్ ఖాన్ తెలిపారు.
- బ్రాడీపేటలోని 11 కేవీ విద్యుత్ మరమ్మత్తుల కారణంగా సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బ్రాడీపేట 6/14 నుంచి 6/21 మధ్య, హాలీవుడ్ బాలీవుడ్ థియేటర్ వెనుక వైపు రోడ్, 11 కేవీ విజయపురి ఫీడర్‌లో గల ఎల్ఐసీ క్వార్టర్స్, ఎల్ఐసీ ఆఫీసు, నవయుగ ఎంక్లేవ్, వికాస్ నగర్ 6వ లైన్, పల్లె గల రెసిడెన్సీ, ఏపీఆర్ బృందావన్, వికాస్ నగర్, 9వ లైన్, విజయపురి జీరో లైన్ నుంచి 7వ లైన్ వరకు, జేకేసీ కాలేజీ రోడ్ 7వ లైన్ ఎస్‌బీఐ బ్యాంక్ వరకు, రాజేంద్ర నగర్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని టీ–2 డీఈఈ ఎస్.గురవయ్య తెలిపారు.
- 11 కేవీ లైన్ మెయింటెనెన్స్ కారణంగా సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు బృందావన్ గార్డెన్స్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతోందని టౌన్–2 డీఈఈ ఎస్.గురవయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పన్నుల రూపంలో ప్రజల నడ్డి విరుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం


సమావేశంలో మాట్లాడుతున్న భారవి

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం పన్నుల రూపంలో ప్రజల నడ్డి విరుస్తుందని పౌర సంఘాలు విమర్శించాయి. గుంటూరు కార్పొరేషన్‌పై రూ.32 కోట్ల అదనపు భారం, పట్టణ ప్రజలపై పన్నుల భారం ఉపసంహరించుకోవాలనే డిమాండ్‌తో ఫెడరేషన్ ఆఫ్ అపార్ట్‌మెంట్స్ అండ్ కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్(ఫాక్వా) ఆధ్వర్యంలో ఆదివారం బ్రాడీపేటలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఫాక్వా కన్వీనర్ ఎల్ఎస్ భారవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని విస్మరించి, పట్టణ ప్రజలపై భారాలు మోపుతోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని పట్టణ ప్రజల ద్వారా రూ.463.93 కోట్లు అదనపు పన్ను వసూలు లక్ష్యంగా ఇచ్చిన ఉత్తర్వులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం అద్దె విలువ ఆధారిత పన్ను విధానం రద్దు చేసి, ఆస్తి విలువ ఆధారిత పన్ను విధానం తీసుకొచ్చిందని, వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన చేశామని గుర్తు చేశారు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ తాము అధికారంలోకి వస్తే ఈ విధానాన్ని పునఃసమీక్షిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో కూడా ఉంచిందని చెప్పారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక పునఃసమీక్షించకపోగా ఇప్పుడు వసూలు చేస్తున్న పన్నులపై 20 శాతం అదనంగా పన్నులు వసూలు చేయాలని మున్సిపాల్టీలు, కార్పొరేషన్లకు లక్ష్యంగా నిర్దేశించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. దీని ద్వారా గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలపై రూ.32 కోట్ల అదనపు పన్ను భారం పడనుందని హెచ్చరించారు. పౌర సంక్షేమ సంఘం నాయకులు కె.నళినీకాంత్ మాట్లాడుతూ ప్లాన్ లేని భవనాలు, ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మించిన భవనాల నుంచి అదనపు పన్ను వసూలు చేస్తామని ప్రభుత్వం చెబుతుందని, ఎన్ని అసెస్‌మెంట్లు ఉన్నాయో లెక్క తేలకుండా ముందుగానే నగరపాలక సంస్థకు రూ.32 కోట్లు లక్ష్యం ఎలా నిర్దేశించారని ప్రశ్నించారు. ప్లాన్‌కు భిన్నంగా నిర్మించిన భవనాలకు కనీసంగా 25 శాతం నుంచి వంద శాతం వరకూ అదనపు భారం పెరగనుందని, అయితే ఇది ప్రతి ఏటా వసూలు చేయటం మరింత ప్రమాదకరం అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్కరణల్లో భాగంగానే రాష్ట్రం పన్నుల భారం మోపుతుందని విమర్శించారు. రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నారాయణరెడ్డి మాట్లాడుతూ భారీగా పన్నులు పెంచుతున్న ప్రభుత్వం అందుకు అనుగుణంగా ప్రజలకు సౌకర్యాలు కల్పించట్లేదని, గుంటూరులో కనీసం తాగునీరు కూడా సక్రమంగా సరఫరా చేయలేకపోతున్నారని విమర్శించారు. అవగాహన సదస్సులో వివిధ సంఘాల ప్రతినిధులు ఏవీ గురుదత్, యుగంధర్, రాధాకృష్ణ, అవధానుల హరి, సదాశివరావు, జి.వెంకటరావు, వీవీకే సురేష్, పీఎస్ శేఖర్‌రెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏఎస్ఐ అనంతలక్ష్మి మృతికి నివాళి



నగరంపాలెం: మహిళా పోలీస్‌స్టేషన్ (పీఎస్) ఏఎస్ఐ ఎల్.అనంతలక్ష్మి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందారు. ఆమె మృతికి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, మహిళా పీఎస్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. జిల్లా పోలీస్ విభాగం నుంచి లక్ష రూపాయలను ఆదివారం ఏఎస్ఐ కుటుంబ సభ్యులకు మహిళా పీఎస్ సీఐలు కృష్ణయ్య, నారాయణ, జిల్లా ఇన్‌చార్జి వెల్ఫేర్ ఆర్ఐ సురేష్, పోలీస్ అసోసియేషన్ సభ్యులు అందించారు. పోలీస్ శాఖ గౌరవ వందనం, అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో రైటర్ యోహాను, జిల్లా పోలీస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మైలా సాంబశివరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి బేబీ రాణి, సంయుక్త కార్యదర్శి లక్ష్మణ్, కోశాధికారి ఎండీ.హుస్సేన్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు కరిముల్లా పాల్గొన్నారు.

సీఐటీయూ జెండా ఆవిష్కరణ

లక్ష్మీపురం: ఐక్యత–పోరాటం సీఐటీయూ నినాదం అని గుంటూరు నగర ముఠా వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) నగర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు అన్నారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం నిర్వహించారు. సంఘం జెండాను నగర ఉపాధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి, జిలాని ఆవిష్కరించారు. కార్యక్రమంలో టింబర్ ముఠా ప్రెసిడెంట్ షేక్ జిలాని, మేస్త్రీలు వెంకటేశ్వర్లు, హుస్సేను, కార్మికులు వలి, హసన్, సైదా, జానీ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ ధర్నా నేడు

లక్ష్మీపురం: నగరంలో 56వ డివిజన్ మోతిలాల్ నగర్‌లో రెండు సెంట్లు స్థలంలో ఐదు లక్షల రూపాయలతో నిర్మాణం వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ అప్లికేషన్లు పూరించడం జరిగిందని సీపీఐ నగర కార్యదర్శి కొటా మల్యాద్రి తెలిపారు. సోమవారం తూర్పు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రౌడీషీటర్లపై నిరంతరం పోలీస్ నిఘా

వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలో కౌన్సెలింగ్



లక్ష్మీపురం: రౌడీషీటర్లపై పోలీసుల నిఘా నిరంతరం ఉంటుందని చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే చర్యలు తీవ్రంగా ఉంటాయని పట్టాభిపురం, నగరంపాలెం సీఐలు నజీర్ బేగ్, గంగా వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఆదివారం గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలో పట్టాభిపురం, నగరంపాలెం, పోలీస్ స్టేషన్‌లలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఆదివారం రౌడీ షీటర్లు పోలీస్ స్టేషన్‌కు తప్పనిసరిగా రావాలని చెప్పారు.

నేడు డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్

నెహ్రూ నగర్: డయల్ యువర్ కమిషనర్ (0863–2224202) కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం కౌన్సిల్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని నగర కమిషనర్ తెలిపారు.

ఘనంగా అహల్యాబాయి జయంతి

గుంటూరు మెడికల్: ప్రజలకు కరువు కాటకాలు రాకుండా 30 సంవత్సరాలపాటు సుపరిపాలనను అందించిన ఘనత లోకమాత దేవి అహ ల్యా భాయ్ కే దక్కుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అన్నారు. ఆదివారం స్థానిక బ్రాడీపేటలోని మాస్టర్ మైండ్స్ కాలేజ్‌లో అహల్యాబాయి జయంతి వేడుకలు జరిగాయి. పలువురు బీజేపీ నేతలు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళా అధ్యక్షురాలు నడ్డి నాగమల్లేశ్వరి యాదవ్, నాయకులు టి.రామకృష్ణ, పి.రవికుమార్, కుమారగౌడ్, వి.గంగాధర్, రేణుకదేవి, గంగా భవాని, మాధవ రెడ్డి, తిరుపతిరాయుడు పాల్గొన్నారు.